క్లుప్తంగా

నోట్‌బుక్స్ పంపిణీ



ఆత్మకూర్: మండలంలోని రేచింతలలో దివంగత మాజీ సర్పంచ్ మురళీధర్‌రావు జయంతి సందర్భంగా బుధవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. సర్పంచ్‌గా సేవలు అందిస్తూనే మురళీధర్‌రావు అనారోగ్యానికి గురై మృతి చెందడం బాధాకరమని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

పాఠశాల ప్రహరీకి కన్నం



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల కంపౌండ్ వాల్‌కు గుర్తు తెలియని వ్యక్తులు రంధ్రం చేయడంతో పాఠశాల ప్రాంగణంలో రాత్రివేళలో అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకోంటున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పదో తరగతి పరీక్షల సమయానికి ముందే ఇలాంటి సంఘటనలు మూడేళ్లుగా జరుగుతున్నాయని పాఠశాల హెచ్‌ఎం బలరాం తెలిపారు. చుట్టు కంపౌండ్ వాల్ ఉండటంతో కొందరు మాస్‌కాపింగ్ కోసం ఇలాంటి పనులకు పూనుకుంటున్నారని ఆరోపించారు. పాఠశాల కంపౌండ్ వాల్‌కు భారీ రంధ్రం చేయడంతో పందులతో పాటు బీసీ కాలనీకి చెందిన ప్రజలు సైతం మైదానంలోంచే పయనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రంధ్రం పూడ్చివేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యువతి అదృశ్యం


గంధం శిరీష

పెబ్బేరు: మండలంలో కంచిరావుపల్లికి చెందిన గంధం శిరీష (21) అదృశ్యమైందని బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు. గంధం శిరీష ఇంటర్ వరకు చదువుకొని ఇంటి వద్దే ఉంటూ తల్లిదండ్రులతో పాటు కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తుంది. ఇదే క్రమంలో 20వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ విషయంపై తల్లిదండ్రులు బంధువులను విచారించిన ఆచూకీ లభించకపోవడంతో తండ్రి గంధం నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు.

కుక్కలతో ఇబ్బందులు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో రోజు రోజుకు పెరుగుతున్న కుక్కలు స్వైరవిహారం చేస్తుండంతో గ్రామంలో ప్రజలు, చిన్నారులు బయటికి రావాలంటే బయపడుతురు. కుక్కల బెడద నుంచి చిన్నారులను, ప్రజలను కాపాడాలని గ్రామస్తులు పెంటయ్య, బిచ్చన్న, కృష్ణయ్య, నవీన్, ఆశన్న, హలీం సర్పంచ్ వినీలారాణిని వినతిపత్రం అందించారు.

మధ్యాహ్న భోజన తయారీకి ఇబ్బందులు



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీకి ప్రతినిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వంట ఏజెన్సీ మహిళలు తెలిపారు. వంట గది లేకపోవడంతో పాఠశాల ఆవరణంలో ఉన్న షెడ్‌లోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నామన్నారు. వంట గది సమీపంలోనే ఓవర్ హెడ్ ట్యాంక్ ఉండటంతో ప్రతి రోజు ఓవర్‌ఫ్లో అయిన నీరంతా వంట గది స్థలంలో నిల్వ ఉండటంతో చిత్తడి నేలగా తయారవుతుందని వాపోయారు. నీరు అతిగా నిల్వ ఉండటంతో వంట చెరుకు సైతం తడిసి పోవడంతో భోజనాన్ని తయారు చేయడంలో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనే దుస్థితి దాపరించిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

జిల్లా కార్యదర్శిగా గాడీల నవీన్

కొత్తకోట: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం జిల్లా కార్యదర్శిగా పట్టణ కేంద్రానికి చెందిన గాడీల నవీన్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు కలిసి నియామక పత్రాన్ని గాడీల నవీన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

సమస్యలు పరిష్కరించండి సారూ

సాక్షి విజిట్

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు సాధ్యం కావడం లేదు. ఇప్పటికీ అనేక పాఠశాలల్లో నీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో పాటు ఇరుకు గదుల్లో వసతి గృహాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో నిత్యం విష పురుగులు, పందులతో విద్యార్థులు సావాసం చేయాల్సి వస్తోంది. మరికొన్నింటిలో సరైన పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దోమలు, ఈగలు చేరి విద్యార్థినులు తరచూ రోగాల బారిన పడుతున్నారు.


వీపనగండ్ల కేజీబీవీలో మరుగుదొడ్లు ఇలా..


కాలకృత్యాలు తీర్చుకునేందుకు బారులు తీరిన బాలికలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మరుగుదొడ్ల పైపులు లీకవడంతో దుర్గంధభరితంగా మారింది. పాఠశాలలో మొత్తం 192 మంది బాలికలు విద్యనభ్యసిస్తుండగా మూడు మరుగుదొడ్లు, ఐదు బాత్‌రూంలు మాత్రమే వినియోగంలో ఉండడంతో విద్యార్థులు క్యూలైన్లలో నిల్చోవాల్సి వస్తోంది. ఉన్న కొద్ది పాటి రూములకు అమర్చిన పైప్‌లైన్ లీకవడంతో పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. బాలికలకు అనువుగా ఉండేందుకు అదనపు గదులు నిర్మించినా.. బిల్లులు రాలేదన్న కారణంతో వాటిని వినియోగంలోకి తేలేదు. ఈ విషయమై ఎస్‌ఓ స్వప్నను వివరణ కోరగా నూతనంగా గదులు నిర్మించిన వారికి బాలికలు పడుతున్న ఇబ్బందులను గురించి తెలియజేసి వెంటనే వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు తరగతి, వసతి గదులు, ఆరుబయట తినాల్సి వస్తోంది. ప్రహరీ లేకపోవడంతో విష పురుగుల బెడద ఎక్కువగా ఉంది. కొన్నిసార్లు కోతులు పాఠశాలలోకి వస్తుండడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 208 విద్యార్థినులు ఉన్నారు. పాఠశాలలో 10 బాత్‌రూమ్‌లు ఉండడంతో పాటు బోరుమోటార్, మిషన్ భగీరథ నీరు రావడంతో తాగునీరు ఎలాంటి సమస్యలు లేవు. అలాగే సోలార్ హీట్ వాటర్ మిషన్ పనిచేయక పోవడంతో వర్షాకాలం, చలికాలంలో విద్యార్థినులకు ఇబ్బందులు ఉన్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి పద్మారెడ్డి తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరంలో ఎంపీపీతో అధికారులు

పాన్‌గల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ప్రాణాంతకమైన వ్యాధులు, ఇతర ఆపద సమయాలలో రక్తం దొరకక చాలా మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో మనం రక్తదానం చేస్తే వారికి మరో జన్మ ఇచ్చిన ట్లేనని గుర్తు చేశారు. పెరుగుతున్న రక్తం అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తహసీల్దార్ ఏసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి కోరారు. యువత రక్తదానం చేయడం ద్వారా ఉత్సాహంతో పాటు కొత్తగా రక్తం ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువత, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి ధ్రువపత్రాలను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు దశరథనాయుడు, ధనుంజయ్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ బృందం మహ్మద్ వహీద్, లక్ష్మి, ఫిరోజ్, కార్తీక్, ఇష్తేకార్‌అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం


మాట్లాడుతున్న కాటం ప్రదీప్‌గౌడ్

మదనాపురం: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దత్తత తీసుకున్న గ్రామాల్లో అభివృద్ధి విస్మరించారని, రామన్‌పాడ్‌ను దత్తత తీసుకొని నట్టేట ముంచారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రామన్‌పాడ్‌లో హాత్ సే హాత్ జోడో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రం సాధించుకుంటే అభివృద్ధి ఉంటుందని భావించిన ప్రజలకు సీఎం కేసీఆర్ అప్పుల కుప్పను అప్పగించారని ఎద్దేవాచేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ రైతుబంధుతో వచ్చే డబ్బులు చక్రవడ్డీల రూపంలో బ్యాంకులే రైతులను దోచుకుంటున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆల దత్తత గ్రామంలో నేటి వరకు కూడా నిరుపేద ప్రజలు గుడిసెల్లోనే జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిత్యావసర ధరలతో ప్రజలు బేంబేలు

నిత్యావసర ధరలను కేంద్రం పెంచుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అప్పులు చేస్తే రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500లకు ఇవ్వడంతో పాటు రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీని చేస్తామని తెలిపారు. ఇళ్లు లేని వారికి రూ.5లక్షలు అందచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనారిటీ కార్యదర్శి అంజాద్ అలీ, టీపీసీసీ ఓబీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వనపర్తి జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, మదనాపురం మండల ఓబీసీ అధ్యక్షుడు ఆవుల రాఘవేంద్రయాదవ్, కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, నాయకులు ఖాదీర్, శ్రావణ్ కుమార్ రెడ్డి, సాయన్న గౌడ్, తిరుపతి నాయక్ కావలి అశోక్ కుమార్, హర్షద్, కురుమూర్తి, రాజేందర్, మధు, అశోక్, విజయ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం


గట్టుకాడిపల్లిలో..


బుద్దారంలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శిగా అలివేలు, విద్యాశాఖ డైరెక్టర్‌గా శ్రావణి, కలెక్టర్‌గా వశీకర్, డీఈఓగా హరిప్రసాద్, ఎంఈఓగా వైష్ణవి, హెచ్‌ఎంగా వైశాలి, సర్పంచ్‌గా భవ్యశ్రీ వ్యవహరించారు. విద్యార్థి ఉపాధ్యాయులను ఎంఈఓ, సర్పంచ్ అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్, ఉప సర్పంచ్ గంగపురి, పాఠశాల హెచ్‌ఎం రంగస్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆంజనేయులు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

గొర్రెలకు నట్టల నివారణ మందులు


ఏదుట్లలో నట్టల నివారణ మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామని పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. మొదటి రోజు మిట్టనందిమళ్లలో 3,221 గొర్రెలు, 312 మేకలు, ఈర్లదిన్నెలో గొర్రెలు 3,101, 272మేకలు, చింతరెడ్డిపల్లిలో 40 గొర్రెలు, 65 మేకలకు నట్టల నివారణ మందులను వేశామన్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో కొనసాగుతున్న పశువులకు నట్టల నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ మందా భార్గవి అన్నారు. బుధవారం ఆమె సమక్షంలో ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని ఏదుట్ల, నాగపూర్, కొంకలపల్లి గ్రామాల్లో నట్టల మందులు వేశారు. ఏదుట్లలో 9,456 గొర్రెలు, 421 మేకలు, నాగపూర్, కొంకలపల్లిలో 4,659 గొర్రెలు, 676 మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏదుట్ల సర్పంచు శ్రీలత, బాల్‌రెడ్డి, పర్వతాలు, శ్రీశైలం, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. గురువారం చెన్నూరు, తండాలో నట్టల నివారణ మందుల పంపిణీ ఉంటుందని వెటర్నరీ అధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఆత్మకూర్: మండలంలోని రేచింతల, తూంపల్లి గ్రామాల్లో బుధవారం పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈనెల 28వ తేదీ వరకు గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందని గొర్రెలు, మేకల కాపరులు, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, డాక్టర్ రమేష్, జేఈఓలు నిర్మల, ఇంద్రజ, సిరాజుద్దీన్, మహిమూద్, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేత



కొత్తకోట: పట్టణ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ భానుప్రకాష్‌శెట్టి తనవంతు సహాయంగా రూ.1.40లక్షలు విరాళంగా బుధవారం నిర్వాహకులకు అందజేశారు. ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్న తరుణంలో దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని నిర్వాహకులు ప్రహ్లాద్, మహేష్, శ్రీకాంత్ కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, హిందూవాహిని సభ్యులు తదితరులు ఉన్నారు.

'అన్ని రైల్వే స్టేషన్లలో దివ్యాంగుల పాసులు ఇవ్వాలి'

పాన్‌గల్: అన్ని రైల్వే స్టేషన్లలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ పాసులు ఇచ్చే సదుపాయం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్లల్లో దివ్యాంగులకు సదరన్ ధ్రువపత్రాలను పరిశీలించి ఆర్టీసీ బసు పాసులు ఇచ్చినట్లుగానే అన్ని రైల్వే స్టేషన్లలో దివ్యాంగుల సదరం ధ్రువపత్రాలను పరిశీలించి రైల్వే పాసులు ఇచ్చే ఏర్పాట్లను చేయాలన్నారు. రైల్వే రాయితీ పాసులు పొందేందుకు సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయానికి రావడానికి దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుబాటులో ఉన్న అన్ని రైల్వే స్టేషన్లల్లో రైల్వే రాయితీ పాసులు ఇచ్చే సదుపాయాన్ని కల్పించి దివ్యాంగుల ఇబ్బందులను తొలగించాలన్నారు.

రవీందర్‌రెడ్డికి సన్మానం



కొత్తకోట: హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్‌లో ఓ పంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించి రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీలో కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చోటు దక్కింది. ఈ మేరకు తోటి రిటైర్డ్ ఉద్యోగులు రవీందర్‌రెడ్డిని పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

27న ఇంటర్వ్యూ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 27న ఉదయం 10 గంటలకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామయ్య తెలియజేశారు. దరఖాస్తుదారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

గడీల పాలనను తరిమికొడదాం


మాట్లాడుతున్న జింకల కృష్ణయ్య

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రజలకు గడీల పాలన నుంచి విముక్తి కలిగించాల్సిన అవసరం వచ్చిందని బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజా గోస-బీజేపి భరోసా కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అంజనేయులు ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతు నాడు ఎన్నో ఉద్యమాలు చేసి సీమాంధ్ర పాలకుల సంకెళ్ల నుంచి తెలంగాణను విడిపించుకున్నామన్నారు. నేడు అంతకంటే ప్రమాదకరమైన దొరల గడీల పాలనలో తెలంగాణ తల్లి ఆత్మ గోషిస్తుందన్నారు. అన్యాయంపై ప్రశ్నించిన ప్రజలను, ప్రతిపక్షాల నాయకులను కేసీఆర్ తొమ్మిదేళ్లుగా పోలీసులతో కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని దుయ్యబట్టారు.ఎంతో మంది బిడ్డల బలిదాలనాలతో తెచ్చుకున్న తెలంగాణలో వారి త్యాగాలకు విలువలేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపినాయక్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి అరవింద్, రాంచందర్, శివశంకర్, రాము, వెంకటయ్య, సురేష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి


సీసీ రోడ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: మున్సిపాలిటీలో ప్రజల సహకారంతోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఖానాపూర్‌లో పీఎఫ్‌ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. రూ.3.50 కోట్ల పీఎఫ్‌ఐడీసీ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని 10వార్డుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే 10 వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అలాగే రూ.50లక్షలతో చెన్నకేశవస్వామి ఆలయం మార్గంలో సీసీరోడ్ల నిర్మాణం, మోడరన్ దోబీఘాట్ నిర్మాణం, డంప్‌యార్డు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు చేయూత..

పట్టణంలోని జాతర మైదానంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తూ వారు క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. మినీస్టేడియం ఆవరణంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కబడ్డీ మైదానాన్ని పరిశీలించారు. పట్టణంలోని క్రీడా మైదానాల్లో షటిల్, ఇతర క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనుల్లో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని జమ్మాపూర్‌లో కాల్వ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ (ఎన్‌ఎంఎంఎస్) విధానాన్ని తప్పక అమలు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని సూచించారు.

కూలీల సంఖ్యను పెంచాలి

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నడుస్తున్న గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా రోజు నీరు పట్టాలని, మొక్కలకు నీడ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని ఆదేశించారు. మొక్కలు ఎండిన పోతే వాటి స్థానంలో నూతన మొక్కలను నాటాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశం ఏపీఓ కుర్మయ్య, ఎంపీఓ రఘురాములు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి


ఇంటి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా

అమరచింత: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. పట్టణంలోని పదో వార్డులో బుధవారం ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీల్లో అమరచింత మున్సిపాలిటీ ఇంటి పన్నుల వసూళ్లలో రెండో స్థానంలో ఉందన్నారు. మొదటి స్థానంలో పెబ్బేరు, మూడవ స్థానంలో కొత్తకోట, నాల్గవ స్థానంలో ఆత్మకూర్, ఐదో స్థానంలో వనపర్తి ఉందన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల ఆధారంగానే పట్టణంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. వీటితో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి ప్రతి నెల వేతనాలు చెల్లించే అవకాశం కలుగుతుందన్నారు. గతంలో పన్నులు చెల్లించకుండా మొండి బకాయిదారులుగా ఉన్నవారి వివరాలను సేకరించి వారికి ప్రభుత్వం నుంచి రావల్సిన పథకాలను నిలిపేయడానకి ప్రణాళిక రూపొందించామని తెలపాన్నారు. పట్టణంలో మురుగుకాల్వల శుభ్రతతో పాటు వీధులు, రహదారుల శుభ్రతకు విఘాతం కలుగకుండా ప్రతి ఒక్కరూ ఇంటి బకాయిలను చెల్లిస్తేనే సకాలంలో వాటిని నిర్వహించే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని పది వార్డుల్లో ఇంటి పన్నుల వసూళ్ల కోసం మూడు బృందాలను నియమించి ప్రతి రోజు శ్రద్ధ చూపుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, ఆర్‌ఐ క్రిష్ణయ్య, ప్రభాకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి రథోత్సవం


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రజాప్రతినిధులు


దాసంగాలు పెడుతున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభు పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవ మూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నం స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్పసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారుశ్రీను, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్ల రామకృష్ణ, పోశన్న, అశ్విన్ కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సుం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామి వారికి మేళతాలాలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి చివరి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.